ఆయిల్‌పాం సాగుపై అవగాహన

ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దుర్తి, మే 24: ఆయిల్‌పాం సాగుతో రైతులు దీర్ఘకాలికంగా లాభాలు పొందవచ్చని లివింగ్ ఫుడ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి రంగనాయకులు, జిల్లా ఉద్యానశాఖ అధికారి నర్సయ్య అన్నారు. శుక్రవారం మాసాయిపేట మండలంలోని లావణ్య ఆయిల్‌పాం తోటలో రైతులకు సస్యరక్షణ చర్యలు, మొక్కల పెంపకంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పాం మొక్కలను సాగు చేయడంతో మధ్యలోని ఖాళీ స్థలంలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. దీంతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్‌పాం సాగులో డ్రిప్ పద్ధతిని పాటించాలని, తక్కువ నీటితో మొక్కలు పెంచవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పాం సాగు చేస్తున్న 90 మంది రైతులు, డ్రిప్ పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు

మెదక్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీలు చేస్తున్న సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ, మే 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 22 పరీక్ష కేంద్రాల్లో ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. తొలి రోజు ప్రథమ సంవత్సరం పరీక్షకు 988 మందికి 942 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 382 మందికి 361 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో రమాదేవి

రామాయంపేట, మే 24: ప్రజావాణి, ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దని మెదక్ ఆర్డీవో కే.రమాదేవి అన్నారు. శుక్రవారం రామాయంపేటలోని తహసీల్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ కార్యాలయంలో పని చేసే సిబ్బంది సమయాభావాన్ని పాటించాలన్నారు. పెండింగ్ ఉంటే వారికి షోకాజ్ నోటీసు లు ఇస్తామన్నారు. సిబ్బంది పని తీరును తహసీల్దార్ రజినీకుమారిని అడిగి తెలుసుకున్నారు. ఆమెతో ఆర్ఐ రాజు ఉన్నారు.

దివ్యాంగుల సంక్షేమాన్ని మరిచిన పాలకులు

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

మెదక్ మున్సిపాలిటీ, మే 24: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య విమర్శించారు. శుక్రవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్ జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు యశోధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2011 నుంచి దివ్యాంగులకు రూ.300 మాత్రమే పింఛన్ ఇస్తున్నదన్నారు. ధరలకు అనుగుణంగా రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. లేకుంటే హక్కుల సాధనకు దివ్యాంగులంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జూలై 21, 22వ తేదీల్లో మెదక్ జిల్లా 7వ మహాసభలు నిర్వహించనున్నామని, వాటిని విజవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రం, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సంతోష్, కిష్టయ్య, చంద్రమ్మ, ముత్యాలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి: ఏడీఏ

కౌడిపల్లి, మే 24: నాణ్యమైన ఎరువులు, విత్తనాలు మాత్రమే పంపిణీ చేయాలని కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి సూచించారు. శుక్రవారం కౌడిపల్లి, కొల్చారం, చిలిపిచెడ్ మండలాల ఏపోలు, ఫెర్టిలైజర్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించే ముందు వారి పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్‌తో పాటు పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రసీదు, ప్యాకెట్టును భద్రపర్చుకుని పంట పూర్తయ్యేంత వరకు ఉంచుకోవాలన్నారు. రైతులు ఏయే విత్తనాలు, ఎరువులు కొంటున్నారో ఫెర్టిలైజర్ డీలర్లు రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఫెర్టిలైజర్ డీలర్లు, ఏవోలు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు వేతనాలు పెంచాలి

రామాయంపేట, మే 24: బీడీ కార్మికులకు 40 శాతం కూలీని పెంచాలని, నెలసరి ఉద్యోగులకు కూడా వేతనాలు పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం రామాయంపేటకు విచ్చేసిన ఆయన బీడీ కార్ఖానాలకు వెళ్లి కార్మికులతో మాట్లాడారు. తెలంగాణలో పని చేసే బీడీ కార్మికుల ఒప్పందం మురిసినందున ప్రభుత్వం వెంటనే వేతన ఒప్పందం చేపట్టాలన్నారు. రాష్ట్రంలో 7లక్షల మంది బీడీ కార్మికులు రోజూ బీడీలు చుడుతారని, అందుకోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని వారిని ఆదుకోవాలన్నారు.

కారు అదుపుతప్పి బోల్తాపడి ఒకరు మృతి

మెదక్‌రూరల్/ చిన్నశంకరంపేట్, మే24: కారు అదుపు తప్పి బోల్తాపడి ఒకరు మృతి చెందారు, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన చిన్నశంరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీ మాందాపూర్ గ్రామం మెదక్, చేగుంట ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌లోని నవాబ్‌పేట్ కాలనీకి చెందిన మేకల మహేశ్ (30) కారులో చేగుంట నుంచి మెదక్ వైపు వస్తున్నాడు. మాందాపూర్ శివారులోకి రాగానే కారు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరోవ్యక్తికి గాయాలయ్యాయి. మెదక్ నుంచి చేగుంట వెళ్తున్న జడ్పీ చైర్‌పర్సన్ హేమలత గమనించి గాయపడిన వ్యక్తిని మెదక్ దవాఖానకు తరలించారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



కౌడిపల్లిలో నల్లపోచమ్మకు ఎమ్మెల్యే సునీతారెడ్డి పూజలు



కొల్చారం: దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నర్సాపూర్: బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

- దొడ్డు రకానికి రూ.500 బోనస్ ఇవ్వాలి
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- దర్గా, నల్లపోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నర్సాపూర్ ,మే 24: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలని, దొడ్డు రకం ధాన్యానికీ రూ.500 బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సాపూర్‌లో విలేకరులతో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదన్నారు. పంట పెట్టుబడికి రైతుబంధు ఇవ్వడంలేదని, కరెంట్ సక్రమంగా సరఫరా చేయడం లేదని విమర్శించారు. పంట అమ్ముకోడానికి కొనుగోలు కేంద్రానికి వస్తే రోజుల తరబడి రైతులు పడిగాపులు కాసినా ఫలితం లేదని మండిపడ్డారు. లారీల కొరత ఏర్పడడంతో రైతుల ధాన్యాన్ని అన్‌లోడ్ చేయకపోగా రోడ్లపైనే వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దొడ్డు రకానికి కాకుండా సన్నరకానికి 500 బోనస్ ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జీలుగ, జనుము విత్తనాల కొరత ఏర్పడి రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో విత్తనాల కొరత లేదన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమించి, వారి సంక్షేమానికి పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, నాయకులు సత్యం గౌడ్, నాగరాజుగౌడ్, సుధాకర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కౌడిపల్లి, మే 24: మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ప్రసిద్ధి చెందిన నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి ఇతర జిల్లాల నుంచి భక్తులు రావడం సంతోషకరమన్నారు. అమ్మవారి కృపతో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ఆలయ పూజారి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

పుట్టిన రోజు వేడుకల్లో ..

మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కుత్బుద్దీన్ పుట్టిన రోజు వేడుకల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీటీసీ ప్రవీణ్, పార్టీ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, కొండల్‌రెడ్డి, రాజు, వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కొల్చారం, మే 24: కొల్చారంలోని దర్గాలో ఎమ్మెల్యే సునీతా రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని నాగసాన్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ అల్లాయిపేట ఎల్లం శుక్రవారం దర్గాలో విందు ఏర్పాటుచేశారు. ఈ విందులో ఎమ్మెల్యే పాల్గొని దర్గాను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ నవీన్‌కుమార్‌గుప్తా, నర్సింగరావు, దుర్గారెడ్డి, అల్లాయిపేట లింగం, నరహరి, రాజు, నాయకులు ఉన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

నర్సాపూర్, మే 24: పెద్దచింతకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రమావత్ భాస్కర్ పామునాటుతో మృతి చెందాడు. భాస్కర్ పార్టీ సభ్యత్వం తీసుకోవడం తో రూ.2 లక్షలు బీమా డబ్బులు మంజూరయ్యాయి. ఈ చెక్కును ఎమ్మెల్యే అతడి భార్య నిర్మలకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు, మాజీ సర్పంచ్ శివకుమార్, గ్రామ అధ్యక్షుడు అంజయ్య, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పనుల్లో వేగం పెంచాలి

చేగుంట: రెడ్డిపల్లి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో చేస్తున్న పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ రూరల్: మెదక్ మండలంలోని కొంటూరు ఉన్న పురాతన మసీదును పరిశీలిస్తున్న కలెక్టర్

- పాఠశాలల పనులు గడువులోగా పూర్తి చేయాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్
- కొంటూరు మసీదును పరిశీలించిన కలెక్టర్

చేగుంట, మే 24: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. చేగుంట మండలంలోని రెడ్డిపల్లి అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనుల పురోగతిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో టాయిలెట్లు, తాగు నీటి సౌకర్యం, విద్యుత్ సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 562 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇప్పట్టివరకు 60శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో పనుల పురోగతిపై సమీక్షించి త్వరితగతిగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఆయా పాఠశాలల్లో చేస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. కలెక్టర్‌తో డీఈవో రాధాకృష్ణ, తహసీల్దార్ గియానిస్సాబేగం, ఎంపీడీవో చెన్నారెడ్డి, ఏంఈవో బుచ్చానాయక్, ఏఈ మమత, ఉపాధ్యాయుడు యాదగిరి తదితరులున్నారు.

పురాతన కట్టడాలతో పర్యాటకులకు కనువిందు

మెదక్‌రూరల్, మే 24: పురాతన కట్టడాలు పర్యాటకులను కనివిందు చేస్తాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ మండలంలోని కొంటూరు చెరువు వద్ద ఉన్న కొంటూరు పురాతన మసీదును కలెక్టర్ పరిశీలించారు. ఆ మసీదు గురించి అడిగి తెలుసుకున్నారు. 500 ఏండ్ల కిత్రం నిర్మించిన ఈ మసీదు కట్టడంలో చిన్న చిన్న మరమ్మతులు ఉన్నాయని, వీటిని సరి చేయాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పురావస్తు శాఖ, వక్ఫ్ బోర్డు అధికారులతో సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టర్ వెంట మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇంజాద్ అలీ, ముస్లిం మతపెద్దలు, అధికారులు తదితరులు ఉన్నారు.

సందేహాలు తీర్చడానికి విత్తన మేళా

మెదక్‌రూరల్, మే 24: వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతపై రైతుల సందేహాలు తీర్చడానికి ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలతో చర్చా గోష్టి ఏర్పాటు చేశారని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం రాజేంద్రనగర్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న విత్తన మేళాకు జిల్లా నుంచి 21 మండలాలకు చెందిన 30 మంది రైతులు హాజరయ్యారు. మేలైన వంగడాలు అందించాలని విశ్వవిద్యాలయం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

శివ్వంపేట, మే 24: పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం చేసిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతుల బొగుడ గ్రామానికి చెందిన కొల్చల్మే పోచయ్య (60) ఈనెల 8న గ్రామ శివారులోని నీటి గుంతలో పడి మృతి చెందాడు. సహజ మరణంగా భావించి అంత్యక్రియలు చేశారు. పోచయ్య మృతిపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తూ గుర్తు తెలియని రియల్ వ్యాపారులు హత్య చేసి కుంటలో పడేశారని ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్ చారీ ఆధ్వర్యంలో ఎస్సై మహిపాల్ రెడ్డి పర్యవేక్షణలో సంగారెడ్డికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అజారుద్దీన్ టీమ్ పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. వివరాలు వచ్చాక వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తూప్రాన్, మే 24: చేపలు పట్టేందుకెళ్లి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం వెంకటాపూర్ అగ్రహారం గ్రామానికి చెందిన గుడ్ల శ్రీశైలం (45) చేపలు పట్టేందుకు గురువారం రాత్రి తూప్రాన్ మండలం ఘనపూర్ శివారులోని గొతాయ చెరువుకు వెళ్లాడు. ఎప్పటిలాగే చేపలు పట్టేందుకు ఎల్‌టీ లైన్ (బోరు మోటారుకు ఉపయోగించే వైర్)కు కొండి వేసి ఆ వైరును చేపల వేటకు చెరువులో వేశాడు. ప్రమాదవశాత్తు కరెంటు వైరు ఆయనకే తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీశైలం భార్య మమత, కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా శ్రీశైలం మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీతాలు ఇచ్చేవరకు పనులు చెయ్యం

చిట్కుల్‌లో పారిశుధ్య కార్మికుల నిరసన

చిలిపిచెడ్, మే 24: మండలంలోని చిట్కుల్, చండూర్ గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, వేతనాలు ఇచ్చే వరకు పనులు చేయ్యమని పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో చిట్కుల్ పంచాయతీ కార్యదర్శి తిరుపతిని వివరణ కోరగా.. గ్రామ పంచాయతీలో డబ్బుల్లేక జీతాలు ఇవ్వలేదన్నారు. పంచాయతీ ట్రాక్టర్‌లో డీజిల్ పోయించడానికీ డబ్బుల్లేవన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి త్వరలో కార్మికులకు జీతాలు అందజేస్తామని తెలిపారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

శివ్వంపేట, మే 24: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ఉపాధి పనుల్లో కూలీ తక్కువగా వస్తున్నదని ఉపాధి కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి, టీఏ సంబంధిత అధికారులు పరిశీలనకు వెళ్లగా కూలీలు వారిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ లేనందున కూలీల నుంచి సీనియర్ మేట్లను ఉపాధి పనులు చేయించేందుకు నియమించారన్నారు. అప్పటినుంచి అక్రమాలు కొనసాగుతున్నాయని, కొందరు పని చేయకున్నా డబ్బులు అందుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి సహకారంతోనే మేట్లు అక్రమాలకు పాల్పడుతున్నారని, కొనుగోలు కేంద్రం వద్ద పనిచేసే మహిళ, ఆర్ఎంపీ పేరిట కూడా ఉపాధి డబ్బులు పడుతున్నాయని కూలీలు ఆరోపిస్తున్నారు. విషయంలో కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపిస్తే అక్రమాలు బయటపడతాయని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈతకని వెళ్లి మృత్యు ఒడిలోకి..

మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

నర్సాపూర్, మే 24: సరదాగా ఈతకని వెళ్లి చెరువులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హన్మంతాపూర్‌లో శుక్రవారం జరిగింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన చాందీపాషా, ఉస్మాన్‌బీ దంపతుల కుమారుడు ఆసిఫ్(12) ఐదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సరదాగా స్నేహితులతో కలిసి నర్సాపూర్ మున్సిపల్‌లోని హనుమంతాపూర్ చెరువులోకి ఈతకు వెళ్లాడు. చెరువులోకి దిగగానే ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

టేక్మాల్, మే 24: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గుంటి రాజు (30) తన తల్లి రాములమ్మతో కలిసి ధాన్యాన్ని విక్రయించడానికి టేక్మాల్‌లోని వ్యవసాయ సహకార కేంద్రానికి గురువారం వచ్చారు. అదే రోజు సాయంత్రం తల్లి ఇంటికి వెళ్లింది. రాజు అక్కడే ఉండిపోయాడు. రాత్రి వేళ మద్యం సేవించడానికి వైన్స్‌కు వెళ్లి, తీసుకుని పక్కనే ఉన్న పర్మిట్ రూంలో తాగాడు. శుక్రవారం ఆ దారిన వెళ్లిన వారు చూసి స్థానిక పోలీసులు, కుటుంబీకులకు సమాచారం తెలిపారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తన కొడుకు మృతిపై అనుమానం ఉన్నట్లు మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఐకేపీ సిబ్బందిని అభినందించిన ఆర్డీవో

తూప్రాన్, మే 24: 3072 క్వింటాళ్ల వడ్లు కొని ఈనెల 11 నాటికి కొనుగోళ్లు పూర్తి చేసిన కేంద్రంగా వెంకటాయపల్లి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిందని తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. 98 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటాయపల్లి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రేఖ, వీవోఏ లత, టాబ్ ఎంట్రీ ఆపరేటర్ శ్రీలతను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సన్మానించారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

కౌడిపల్లి, మే 24: కౌడిపల్లిలో డంపింగ్ యార్డు, పల్లెప్రకృతివనం, శ్మశాన వాటికను శుక్రవారం డీపీవో యాదయ్య ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్మశానవాటిక పనులు పూర్తి చేయాలన్నారు. పల్లెప్రకృతివనాన్ని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా నీళ్లందించాలన్నారు. డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్త వేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఆయన వెంటన కౌడిపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశం ఉన్నారు.

సజావుగా పాలిసెట్

మెదక్ మున్సిపాలిటీ, మే 24: జిల్లా కేంద్రంలోని 4 కేంద్రాల్లో శుక్రవారం పాలిసెట్ సజావుగా జరిగింది. ఈ పరీక్షకు 1590 మందికి 1462 మంది విద్యార్థులు హాజరయ్యారని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సువర్ణలత తెలిపారు. జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను ఆమె సందర్శించారు.

జీలుగ విత్తనాలతో భూసారం పెరుగుతుంది

చేగుంట, మే 24: భూసారాన్ని పెంపొందించుకోవడానికి జీలుగ విత్తనాలను పొలాల్లో వేసుకోవాలని, సబ్సిడీపై రైతులకు అందిస్తున్నామని రామాయంపేట ఏడీఏ వసంత సుగుణ, మండల వ్యవసాయశాఖ అధికారి హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం చేగుంటలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీతో రైతులకు అందజేశారు. క్వింటాల్‌కు రూ.9300కు సబ్సిడీ ద్వారా రూ.5580లకు పోగా రైతులు రూ.3720 చెల్లించాలన్నారు.

గాలివానకు కూలిన విద్యుత్ స్తంభాలు

కొల్చారం, మే 24: మండలంలోని నగరం, రంగంపేటతోపాటు పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం గాలివానకు 60 విద్యుత్ స్తంభాలు, ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయని విద్యుత్ ఏఈ హైమద్‌లీ తెలిపారు. రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేస్తున్నామని పేర్కొన్నారు.

పాస్టర్ మృతికి సంతాపం

నర్సాపూర్, మే 24: నర్సాపూర్ పట్టణ మొట్టమొదటి పాస్టర్ జాన్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

శివశక్తి సేవలు అభినందనీయం

పెద్దశంకరంపేట, మే 24: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో శివశక్తి సంఘ సభ్యులు చేపడుతున్న సేవలు అభినందనీయమని ఆ సంఘం ఖోడ్ అసెంబ్లీ ఇన్‌చార్జి శివాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని మాచ్చెట్‌పల్లి గ్రామంలో హనుమాన్ ఆలయంలో గీతా అలారం, హనుమాన్ చాలీసా కరపత్రాలు పంపిణీ చేశారు. సంఘం బాధ్యులు దుర్గేశ్, గోపాల్, లింగం, శివ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నర్సాపూర్, మే 24: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నర్సాపూర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన నక్క శ్రీశైలం(30) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం గుమ్మడిదల వెళ్తుండగా నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని మేడారం దేవాలయం మూలమలుపు వద్ద గుర్తుతెలియని వాహనం శ్రీశైలం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీశైలం కాలు విరిగి, తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కూతురు ఉన్నారు.

గర్భిణిపై ఉద్యోగి అసభ్య ప్రవర్తన

నర్సాపూర్, మే 24: స్కానింగ్ కోసమని నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానకు వచ్చిన ఓ గర్భిణిపై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన నర్సాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్లితే నర్సాపూర్‌కు చెందిన అమీర్ స్థానిక దవాఖానలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి. శుక్రవారం ఓ మహిళ స్కానింగ్ కోసమని దవాఖానకు వచ్చింది. ఆ మహిళ స్కానింగ్ రూమ్‌లోకి వెళ్లగానే అక్కడ ఉన్న